వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



స్టిక్కర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

లేపాక్షి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి గృహ సారథులు కృషి చేయాలని, 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపులో ప్రధాన పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం స్థానిక స్థానిక ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల కన్వీనర్ నారాయణ స్వామి అధ్యక్షతన గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, చైతన్య పరచాలన్నారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని తేడాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో ఇంటింటికీ పారదర్శకంగా పథకాలు అందాయని తెలిపారు. గృహ సారథులు బాగా పని చేస్తే పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం కూడా మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వలంటీర్లు, స్థానిక నాయకులను సమన్వయం చేసుకుని ప్రతి గడపకు అందిన సంక్షేమ ఫలాలు వివరించాలన్నారు. అనంతరం గృహసారథులకు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపిపి నీలావతి, సర్పంచ్‌లు ఆదినారాయణ, అశ్వర్థ నారాయణ, మంజునాథ్, పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

చిలమత్తూరు: గృహసారథులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. గురువారం స్థానిక కన్యకా పరమేశ్వరీ కల్యాణ మంటపంలో గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. పారదర్శకంగా పథకాలు అమలు చేసి, నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు సొమ్ము జమ చేసిన ఏకైన ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. పచ్చ పత్రికల్లో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులపై అసత్య కథనాలు ప్రచురిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బయప్ప, అంజలీ దేవి, సర్పంచ్ సంధ్య, మురళి, సింగిల్ విండో చైర్మన్ జబీవుల్లా, పార్టీ నాయకులు నాగరాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

హిందూపురం: వైఎస్సార్‌సీపీకి వారధులు గృహ సారథులని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. గురువారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద హిందూపురం మండల గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎవరికైనా అర్హత ఉండి లబ్ధి పొందకపోతే గురించి.. వారికి పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని 2024లో గెలిపించి తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, సర్పంచులు శ్రీనివాసరెడ్డి, దేవరాజు, ఆనంద్, ఎమ్పీటీసీ బాలచంద్ర, నాయకులు బసిరెడ్డి, రాము, మూర్తి, చంద్‌బాష, ఆదెప్ప, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా యువత అధ్యక్షుడిగా నియమితులైన వాల్మీకి లోకేష్‌ను ఎమ్మెల్సీ ఇక్బాల్, పార్టీ నాయకులు అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. గురువారం తన స్వగృహంలో ఎమ్మెల్యే నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాలతోపాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్లు దాదాపు 4,055 మంది, టీచర్ ఓటర్లు 204 మంది ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ప్రతి బూత్‌కు 10 మంది చొప్పున ఇన్‌చార్జిలను వేశామని తెలిపారు. వీరందరూ ఈఎన్నికల ప్రచారంపై దృష్టి పెడతారని తెలిపారు.అంతే కాకుండా పోలింగ్ రోజున కూడా వీరు బాధ్యత తీసుకుని పని చేస్తారని తెలిపారు. ఇన్‌చార్జిలతో నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని కోరారు. గ్రామ స్థాయిలో ప్రతి ఓటరుని కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేసేలా చూడాలని కోరారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల వారీగా ఇన్‌చార్జిలకు పట్టభద్రుల ఓటర్ల వివరాలను ఎమ్మెల్యే అందించారు. మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీపీలు రాధమ్మ, కవిత, ఈరన్న, డైరెక్టర్లు నాగన్న, నాగరాజగౌడ్, పీఏసీఎస్ అధ్యక్షుడు రామిరెడ్డి, చంద్ర, పార్టీ కన్వీనర్ మహేంద్ర, జేసీఎస్ కన్వీనర్లు నాగేంద్ర, శివన్న, శ్రీనివాసరెడ్డి, రొళ్ల నాగేంద్ర, శివకుమార్, ఈశ్వర్, సర్పంచుల ప్రతినిధి డీఎల్ యంజారేగౌడ్, ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం

వైఎస్సార్‌సీపీలో చేరిక

మడకశిర: పట్టణంలోని వడ్రపాళ్యం గ్రామానికి చెందిన 10 కుటుంబాలు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో వీరు వైఎస్సార్‌సీపీలో తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వడ్డేశివప్ప, గిరిజమ్మ, నాగరత్నమ్మ,రాజప్ప, భాగ్యమ్మ, గోవిందమ్మ,శాంతమ్మ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. మహిళలు వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్ పార్వతమ్మ, నాయకులు జయరాజ్,దాసన్న,సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

హిందూపురం టౌన్: గ్రామాలను అభివృద్ధికి చేయడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీపీ రత్నమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు సమస్యలను వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు, నూతన నిర్మాణాలు, విద్యుత్ సమస్యలను ప్రస్తావించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో పంచాయతీల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నివేదికల రూపంలో అధికారులు వివరించారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రత్నమ్మ, ఎంపీడీఓ నరేంద్ర మాట్లాడుతూ.. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా తమకు దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయం, పశు సంవర్ధక, హార్టికల్చర్, సిరికల్చర్, ఉపాధి హామీ పథకం తదితర శాఖల్లో ప్రభుత్వం అనేక పథకాలు, రాయితీలు అందిస్తోందన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగభూషణం, వైస్ ఎంపీపీలు రఘునాథ్‌రెడ్డి, రామాంజి, స్పెషల్ ఆఫీసర్ సురేష్, ఎంపీడీఓ నరేంద్ర, ఏటకుళ్లాయప్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రత్నమ్మ

శోభాయాత్ర విజయవంతం చేద్దాం

హిందూపురం టౌన్: పట్టణంలో ఈనెల 26న ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ సందర్భంగా చేపట్టిన బైక్ ర్యాలీ శోభాయాత్రను విజయవంతం చేద్దామని ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ సభ్యులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సత్యనారాయణ పేట సాయిబాబా దేవాలయం, పాండురంగనగర్‌లోని వివేకానంద యోగా సెంటర్, సాయిసదన్, గాంధీ సర్కిల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటు భూమి పూజకు స్వామి పరిపూర్ణానంద రానున్నారన్నారు. సూగురు ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మేళాపురం వరకూ శోభాయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఛత్రపతి శివాజీ సేవా ట్రస్ట్ పట్టణ యువత అధ్యక్షుడిగా మణికంఠను నియమించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు గతిస్వం శివ, మణికంఠ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

మడకశిరరూరల్: మండలంలోని మణూరు, కల్లుమర్రి గ్రామ సచివాలయాలను గురువారం ఎంపీడీఓ సోనిబాయి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాలు, సచివాలయ సేవలు, జగనన్న స్వచ్ఛ సంకల్పంపై సిబ్బందితో చర్చించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయ పాలన పాటిస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. వేసవి ప్రారంభం కావడంతో గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా సర్పంచులతో కలిసి నీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. స్పందన అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కారం చూపాలన్నారు. ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శులు ఆనంద్‌కుమార్, వరదరాజులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సిబ్బందితో చర్చిస్తున్న ఎంపీడీఓ సోనిబాయి

రిజిస్టర్ చేసిన భవనాల పరిశీలన

హిందూపురం: పట్టణంలో ఇటీవల రిజిస్ట్రేషన్లు చేసిన భవనాల కొలతలు వాటి లొకేషన్లను స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి గురువారం తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీనివాసనగర్, టీచర్స్ కాలనీ, నానెప్పనగర్, కొట్నూరు తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేసిన భవనాలు, స్థలాల వైశాల్యం తదితరాలను నిబంధనల ప్రకారం చేశారా? లేదా? అని పోస్ట్ ఫ్యాక్ట్ తనిఖీ చేశారు. అలాగే రిజిస్టర్ ఆఫీసులో రికార్డులు, ఉద్యోగులు, సిబ్బంది పనితీరులను పరిశీలించారు. ప్రతి రిజిస్ట్రేషన్ ప్రభుత్వ నిబంధనలు, విలువల ఆధారంగా చేయాలని ఆదేశించారు. ఆఫీసులో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు భాగ్యశేఖర్, చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఫీల్డ్‌లో రిజిస్ట్రేషన్ చేసిన భవనాలను పరిశీలిస్తున్న డీఐజీ మాధవి

బాధ్యతతో విధులు నిర్వహించండి



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కార్తిక్

సోమందేపల్లి: గ్రామ సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్ సూచించారు. తుంగోడు గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సావిత్రి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట

గోరంట్ల: వానవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సర్పంచ్ శ్రీరాములు, హెచ్‌ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. 1981–1982 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు అందించిన విగ్రహాన్ని ఊరేగించి పాఠశాల ఆవరణలో ప్రతిష్టించారు. పూర్వ విద్యార్థులు నందమోహన్ రెడ్డి, సత్యనారాయణగుప్త, వేణుగోపాల్, సీతారామారావు, ఈడిగ ఆంజినేయులు, జాంపుల వెంకటరమణ, నాగమణి, నిర్మల, సుశీల పాల్గొన్నారు.

బ్లాక్‌స్పాట్ల గుర్తింపు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణలో భాగంగా సీఐ కరుణాకర్ గురువారం బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. గుట్టూరు నుంచి సోమందేపల్లి వరకు జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించామని, ఆయాప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు, జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్‌హెచ్ హైవే అధికారులు, ఎంవీఐ సీవీ రమణ, కియా ఎస్‌ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటి స్థలాన్ని ఇప్పించండి

పావగడ: తన ఇంటి స్థలాన్ని శ్రీనివాసగుప్త కబ్జా చేశాడని ఈఓ శివరాజయ్య కు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని, తనకు తల దాచుకోడానికి ఇల్లు ఇప్పించాలని మంగళవాడకు చెందిన దళిత మహిళ మంజుల లోకాయుక్త ఎస్పీ పాషావలి ఎదుట వాపోయింది. స్థానిక టీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె తన బాధను లోకాయుక్త ఎస్పీతో మొర పెట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ పాషావలి మాట్లాడుతూ ఇంటి స్థలం కోల్పోయిన మంజుల ఇంటి స్థలాన్ని తక్షణమే విడిపించి ఆమెకు ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఈఓ శివరాజయ్యను ఆదేశించారు. బాధితుల సమస్యలు సకాలంలో పరిష్కరించకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిడుగల్‌కు చెందిన జయమ్మ ఇంటిలో దొంగతనం జరిగి నాలుగు నెలలైనా ఇంత వరకు కేసు నమోదు కాకపోవడంతో సీఐ కాంత రెడ్డిపై మండి పడ్డారు. కార్యక్రమంలో 15 మంది బాధితులు ఫిర్యాదులు అందించారు. డీఎస్పీ మంజునాథ్, ఎస్‌ఐలు సత్యనారాయణ, శివరుద్రప్ప, తహసీల్దార్ సుజాత, ఇఓ శివరాజయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం ఇద్దరి అరెస్ట్

గోరంట్ల: కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 480 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఇక్బాల్ బాషా తెలిపారు. కాగాని పల్లి క్రాస్ వద్ద గురువారం వాహన తనిఖీలు చేస్తుండగా బాగేపల్లి వైపునుంచి గోరంట్ల వైపు వస్తున్న ఆటోను సోదా చేయగా మద్యం ప్యాకెట్లు లభించాయన్నారు.ఆటోను సీజ్ చేసి రవాణాదారుడైన పుట్టపర్తి మండలం పెడపల్లికి చెందిన సోమశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా బైక్‌లో కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న కర్ణాటకకు చెందిన లోకేష్ అనే వ్యక్తిని పెరమాళ్లపల్లి వద్ద అరెస్ట్ చేసి బైక్ సీజ్ చేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

రొద్దం: కోగిర ఎస్సీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎంపీపీ చంద్రశేఖర్ గురువారం భూమిపూజ చేశారు. సర్పంచ్ రమాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, ఎస్సీసెల్ అధ్యక్షుడు గంగాధర్, సచివాలయ కన్వీనర్ చిలకల రవి, ఎంఆర్‌పీఎస్ నాయకులు రామాంజినేయులు, రామకృష్ణ తదితరలు పాల్గొన్నారు.

కోలాటానికి వైఎన్ హొసకోట పుట్టినిల్లు

పావగడ: కోలాట కళకు వైఎన్ హొసకోట పుట్టినిల్లని ప్రముఖ కవి హోమా నాగరాజు తెలిపారు. వైఎన్ హొసకోటలోని రాష్ట్రీయ విద్యా పీఠం లో గురువారం నిర్వహించిన గడినాడు సాంస్కృతిక ఉత్సవంలో ఆయన మాట్లాడారు. పాండురంగ భజనలోనూ వైఎన్ హొసకోటకు అందె వేసిన చేయి అని తెలిపారు. శారీరక, మానసిక ఆరోగ్యం కాపాడడంలో జానపద కళలు ఎంతో ప్రాధాన్యతను పొందాయన్నారు. ఒకప్పుడు సాయంత్రం వేళల్లో యువకులు కోలాటం, భజనలు, ఆటపాటలతో తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేవారన్నారు. కళాకారుడు లింగప్ప, కసాప కార్యదర్శి నారాయణప్ప, విద్యాసంస్థ కార్యదర్శి అశ్వథ్‌కుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా సుగమ సంగీతం, కీలు గుర్రం, చిలిపిలి బొమ్మ, తత్వ పదాలు, నాసిక్ డోల్ తదితర కళలను ప్రదర్శించారు.



పాండురంగ భజన చేస్తున్న కళాకారులు

ఈడిగలు అన్ని రంగాల్లో రాణించాలి

పెనుకొండ: ఈడిగ కులస్తులు విద్యావంతులై అన్ని రంగాల్లో రాణించాలని ఆ సముదాయ నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో గురువారం ఈడిగ సముదాయ ప్రజల సమావేశం జరిగింది. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నప్పయ్య, గిరిధర్ గౌడ్ మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఐక్యతతో ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పిల్లలను విద్యావంతులను చేయాలని సూచించారు. ఈడిగ సముదాయ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎంపిక చేశారు. ప్రకాష్‌గౌడ్, పద్మ, నీళ్ల రమణ, వెంకటరమణ, గోపి, మారుతి, శ్రీరాములు, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నరేంద్రకుమార్

మడకశిర(అగళి): అగళి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నరేంద్రకుమార్ నియమితులయ్యారు. ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. హిందూపురం రెగ్యులర్ ఎంపీడీఓగా పని చేస్తున్న ఈయనకు అగళి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇంతకు మునుపు ఇన్‌చార్జ్‌గా ఉన్న శ్రీనివాసరావు ఏఓగా కొన సాగనున్నారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్ మడకశిరలో ఎమ్మెల్యే తిప్పేస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని ఎంపీడీఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



చింత చెట్టుకు ఢీకొన్న బొలెరో వాహనం

మడకశిరరూరల్: బొలెరో వాహనం చింతచెట్టును ఢీకొన్ని ఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. గురువారం ఉదయం అగళి మండలం నుంచి హిందుపురం మార్కెట్‌కు చింత పండు లోడుతో బొలెరో వాహనం బయలుదేరింది. మడకశిర మండలం యూ రంగాపురం వద్ద వాహనం అదుపుతప్పి చింత చెట్టును ఢీకొంది. డ్రైవర్, చింత పండు రైతులు సురక్షితంగా బయటపడ్డారు. వాహనం ముందు భాగం దెబ్బతినింది. మరొక వాహనంలో చింత పండును మార్కెట్‌కు తరలించారు.

పరామర్శ



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురంలోని నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న గోరంట్ల మండలం జావుకులదిన్న గ్రామానికి చెందిన ఏపీఎన్‌జీవో మాజీ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డిని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఘనంగా భజన మండలి రజతోత్సవం

రొద్దం: మండల పరిధిలోని నల్లూరు గ్రామంలో సత్యసాయి భజన మండలి రజతోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చోళేమర్రి బస్‌స్టాండ్‌నుంచి బైక్ ర్యాలీ, బాలవికాస్ పాఠశాల విద్యార్థులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. సత్యసాయి చిత్రపటానికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. 36 మంది విద్యార్థులకు దుస్తుల వితరణ చేశారు. సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రునిలక్ష్మణ రావు, జిల్లా సేవాసమితి అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, సత్యసాయి సేవాసమితి జోనల్ సీఆర్‌రావు, మండల సమితి కోఆర్డినేటర్ అంజినరెడ్డి, సభ్యులు రవిశేఖర్‌రెడ్డి, ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మూత్రపిండాలు దెబ్బతిని మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన తలారి ఆంజినేయులు(34) మంగళవారం మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ. 10 వేలను మృతుని భార్య ఆదిలక్ష్మికి వైస్ ఎంపీపీ చంద్రకళ, సర్పంచ్ అశ్వర్థనారాయణ గురువారం అందజేశారు.

గాలి జనార్ధనరెడ్డి సభ జయప్రదం చేయండి

పావగడ: స్థానిక గురుభవన్ మైదానంలో ఈ నెల 26 న తలపెట్టిన కళ్యాణ రాజ్య ప్రజా పార్టీ వ్యవస్థాపకుడు గాలి జనార్ధన రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని స్థానిక కేఆర్‌పీపీ నాయకుడు నేరళకుంటె నాగేంద్ర కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాలి జనార్ధనరెడ్డి తొలుత పట్టణంలో కేఆర్పీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని, ఎస్ఎస్‌కే రంగమందిరంలో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారన్నారు. నాయకులు ఎస్ హనుమంతరాయప్ప, కరియణ్ణ, అంజినరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయండి

రొళ్ల: పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమ్యూనిటీ భవనంలో దొడ్డేరి, రొళ్ల సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆరు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులకు బాలామృతం, రోజూ వంద ఎంఎల్ పాలు, ఒక గుడ్డు అందించాలన్నారు.

పచ్చపత్రిక దహనం



ఈనాడు దినపత్రికను తగులబెడుతున్న దృశ్యం

తప్పుడు కథనాలు ప్రచురించిన ఈనాడు దినపత్రికను గురువారం లేపాక్షి బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు దహనం చేశారు.

– లేపాక్షి:

ఇనగలూరు చేపల చెరువు వేలం

మడకశిర(అగళి): అగళి మండలం ఇనగలూరు చేపల చెరువును గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. కామరాజు అనే వ్యక్తి ఈచేపల చెరువును రూ.35 వేలకు దక్కించుకున్నట్లు గ్రామ కార్యదర్శి ఫణిరాజు తెలిపారు. సర్పంచు మంజుల, ఈఓఆర్‌డీ పద్మావతి పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థికసాయం

హిందూపురం టౌన్: పెనుకొండలోని అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు ఉడుకబెట్టిన వేడి నీటిలో పడి తీవ్రంగా గాయపడిన చిన్నారి వెన్నెలకు స్థానిక అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బాసటగా నిలిచారు. పట్టణంలో చిన్నారి వెన్నెల చికిత్స పొందుతుండగా వైద్య ఖర్చుల కోసం కుటుంబ సభ్యులకు రూ.25 వేలు అందజేశారు. అలాగే చిన్నారి త్వరగా కోలుకుని ఆకాంక్షిస్తూ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అమన్, ట్రస్ట్ కార్యదర్శి ఉమర్ ఫరూక్, జాయింట్ సెక్రటరీ ఉస్మాన్, బ్లడ్ ప్రెసిడెంట్ సాధిక్, సభ్యులు వివేక్, ఆయాజ్, అర్షద్, ధనుష్, మన్ను, హరీష్, సత్తి, కృష్ణ, అభి, లోకి పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

రొద్దం: చిన్నకోడిపల్లిలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ కాటిమ తిమ్మారెడ్డి కుమారుడు విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్‌మ్యాన్ హనుమంతరెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నవగ్రహాల పూజలో పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

లేపాక్షి: బ్లడ్ క్యాన్సర్‌తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బి.అజయ్‌కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.54,780 ఆర్థికసాయాన్ని గురువారం అందజేశారు. వివరాలు.. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ చోళసముద్రం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇతడి తల్లిదండ్రులు శివప్ప, నాగమణి పెయింటింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అజయ్ కుమార్‌కు వైద్యం చేయించేందుకు ఇబ్బందులు పడుతుండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. రూ.54,780 పోగు చేసి, విద్యార్థి తండ్రికి ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి




ఎమ్మెల్యే శంకరనారాయణను సన్మానిస్తున్న పాటూరి శంకరరెడ్డి

గోరంట్ల: వైఎస్సార్ సీపీ బలోపేతానికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని జిల్లా రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు పాటూరి శంకరరెడ్డి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ తనపై నమ్మకంతో పదవి అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతలు నిర్వహిస్తానన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

పాటూరి శంకరరెడ్డి గురువారం పెనుకొండలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు



విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మడకశిరరూరల్: 'కోడ్ కూసినా ..' శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని ఆమిదాలగొంది పంచాయతీ కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి వెంటనే అధికారులు ముసుగు వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల కోడ్‌ను పారదర్శకంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూదరుల అరెస్ట్

మడకశిర: మండలంలోని దేవన్నపాళ్యం వద్ద గురువారం సాయంకాలం జూద కేంద్రంపై దాడి చేసి ఇద్దరు జూదరులను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.48వేల నగదుతో పాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు జూదరులు తప్పించుకున్నారని తెలిపారు. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో పుట్టపర్తి డీటీఎఫ్ ఎస్ఐ జబీవుల్లా, హెచ్‌సీ శంకర్‌నాయక్, ఇంటెలిజెన్స్ హెచ్‌సీ వెంకటేశులు పాల్గొన్నారు.